## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

**ప్రజాపక్షం/సిద్దిపేటః** రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు.బుధవారం ఐడిఒసి సమావేశ మందిరంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్య అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆర్ఎంపి, పిఎంపిలు దోమలు అభివృద్ధి చెందకుండా క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.అవసరం ఉన్న చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు.అనంతరం మాతాశిశు సంరక్షణలో భాగంగా గర్భిణీ స్త్రీ నమోదు నుండి ప్రసవం అయ్యేంతవరకు జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు వైద్యాధికారులు సమీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త నమూనాలను ప్రతిరోజు సేకరించి టి హబ్‌కు పంపిస్తూ వాటిపై రెగ్యులర్ మానిటరింగ్ నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాని, చేయాలని సమయ పాలన పాటించని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధన్ రాజ్,ప్రోగ్రాం ఆఫీసర్లు వినోద్ ఎన్‌సిడి,నిర్మల టిబి,దీప్తి ప్రియాంక సిహెచ్ఐ,డిప్యూటీ డిఎంహెచ్‌వో మహేందర్ రెడ్డి,శ్రీకాంత్,సుహన్ రాథోడ్,నవీన్ రాజ్ పాల్గొన్నారు.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట






# యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### మెగా జాబ్ మేళాలు యువత జీవితాలకు కొత్త ఆశలకు నాంది
### ఉద్యోగం సాధించిన యువత కుటుంబానికి ఆర్థిక బలాన్ని చేకూర్చాలి
### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగుః** జిల్లాలోని యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మెగా జాబ్ మేళాలు నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త ఆశలకు నాంది పలుకుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచర్లలోని ఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళా 2026 కార్యక్రమానికి మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ముఖ్య అతిధిగా హాజరై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనగుణంగా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. ఉద్యోగం చేయాలనే సంకల్పంతో యువత నిరంతరం కృషి చేయాలని, వచ్చిన అవకాశాలను వదులుకొని సమాయాన్ని వృథా చేస్తూ మత్తు పదార్థాల ఊబిలో చిక్కుకోకుండా గౌరవ ప్రదమైన జీవనాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. మేధో సంపత్తి పెంపొదించుకునేందుకు నిరంతరం శ్రమిచాలని, జీవితంలో ఉన్నత ఆశయాలను సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యువతకు ప్రత్యేకంగా వసతి గృహాలు ఏర్పాటు చేసి గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందించే ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని అన్నారు. ములుగు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే యువత ఆర్థికంగా బలోపేతం కావాలని, ఉద్యోగ ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడడంతో పాటు జిల్లా అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఉద్యోగం రాని వారు నిరుత్సాహపడద్దని, వారికి మరల అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. యువత ఇంటి వద్ద తల్లిదండ్రులకు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాకెట్‌లా దూసుకుపోవాలని సూచించారు. ప్రయివేట్ ఉద్యోగాలు చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం కావాలని, త్వరలో రాబోయే పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం జిల్లా యువతీ యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఏఎస్పి మనన్ భట్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

### ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో డాక్టర్ శ్రీనివాస్ ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్‌ను డాక్టర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణుల వైద్య సేవలు పొందవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను ఎమ్మెల్యే పరిశీలించి డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు ముద్దసాని సురేశ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వైద్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి

### ఒక్క పాఠశాల కూడా వసతులు, ఉపాధ్యాయులు లేక మూత పడవద్దు
### ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/ధర్మ సాగర్ :** నర్సింగరావుపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాలను మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల వసతులు కల్పించే బాధ్యత నాదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు.ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామంలో 14సంవత్సరాల క్రితం మూత పడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునర్ ప్రారంభోత్సవం, ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలను పునర్ ప్రారంభించారు. అంతకు ముందు నర్సింగరావుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ14ఏళ్ల క్రితం మూతపడిన మండల ప్రజా పరిషత్ పాఠశాలను తిరిగి ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడా కూడా ప్రభుత్వ పాఠశాలలు మూత పడకూడదు అని విద్యా శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలతో పాటు ప్రీ ప్రైమరీ పాఠశాలను కూడా ప్రారంభించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక ఈ పాఠశాలలో ప్రీ ప్రైమరీ నుండి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలోనే బోధన ఉంటుందని తెలిపారు. నర్సింగరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో అన్ని వసతులకు కల్పించే బాధ్యత నాదని మీ పిల్లలు 5వ తరగతి వరకు బయటకు వెళ్లకుండా ఈ పాఠశాలకు పంపించే బాధ్యత మీదని సూచించారు. ఈ పాఠశాలను ఒక మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని, విద్యార్థులకు ఆట వస్తువులను సైతం అందిస్తానని హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో వసతులు లేక, ఉపాధ్యాయులు లేక ఒక్క పాఠశాల మూత పడడానికి వీలు లేదని స్పష్టం చేశారు. త్వరలోనే నారాయణగిరిలో తెలంగాణ మాడల్ స్కూల్ ప్రారంభం కాబోతుందని తెలిపారు. స్థానిక సర్పంచ్ శిభారాణి కుమారస్వామి, డిఈవో, ఎంఈవో, తహసీల్దార్, ఎంపిడివో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని గణపురం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, బుద్దారం పాఠశాలలో పాఠ్య పుస్తకాలు బుధవారం సర్పంచ్‌లు కట్కూరి రాధిక శ్రీనివాస్, విడిదినేని శ్రీలత అశోక్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, డిజిటల్ విద్య, పోటీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధుల్ని చేయుట వంటి ప్రత్యేక కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సురక్షితమైన తాగునీరు, మరుగుదొడ్లు, వంటి అన్ని రకాల మౌళిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. ప్రయివేట్ పాఠశాలలకు వెళ్ళి అనవసరంగా వేలాది రూపాయల డబ్బులు వృథా చేసుకోవద్దని ప్రభుత్వ బడుల్లో ఉన్న వసతులను, నిపుణులైన ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణను అలవర్చుకొని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కృష్ణ, మారబోయిన ఐలయ్య, ప్రధానోపాధ్యాయులు దూలం కుమారస్వామి, దేసు సతీష్, శ్రీలత, భరత్ కుమార్, శకీరా బేగం, రాంబాబు, రమేష్, శ్రీనివాస్, దేవేందర్, ముస్తాక్, దిల్షాద్, పిడి సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రంలో 'ఎవరి కులం ఎంతో వారికి అంత వాటా' అనే కరపత్రాన్ని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు కండె రవి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కూరగాయల సంత డిగ్రీ కాలేజీ వెనుకాల సుభాష్ కాలనీలో జరుగుతుందన్నారు. 90 శాతం ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు వేల సంవత్సరాల నుండి దోపిడికి గురవుతున్నారన్నారు. మూడున్నర కోట్ల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు బానిసత్వం, అణిచివేత పోవాలంటే రాజకీయ భూకంపం ప్రజల్లో రావాలన్నారు. సామాజిక న్యాయ సమరం సాగాలి, రాజ్యాధికార యుద్ధం రగిలించాలన్నారు. ఇదే అసలైన ప్రజాస్వామ్యం, గణతంత్ర రాజ్యానికి పునాది, ఇదే భారత రాజ్యాంగం ఆశించిందన్నారు. పూలే, అంబేద్కర్, కాన్షిరాములు కోరుకున్నది. ఇదే తెలంగాణ రాష్ట్ర ప్రజలందరినీ ఈ దిశగా చైతన్య పరిచి సామాజిక న్యాయం రాజ్యం వైపు నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, ఇంజపల్లి విక్రమ్, కొమ్ముల లింగన్న, ఇంజపెల్లి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# కార్యదర్శులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామ పంచాయతీకి బదిలీపై వచ్చిన నూతన కార్యదర్శి షేక్ షఫీని శాలువాతో సన్మానం చేసి స్వాగతం పలికి అలాగే గత నాలుగు సంవత్సరాలుగా కార్యదర్శిగా సేవలందించిన చంద్రగిరి రాకేష్ ఉద్యోగ బదిలీని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి అందించిన సేవలను గ్రామస్థులు కొనియాడారు. అదేవిధంగా నూతన గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన షేక్ షఫీకు ఘన స్వాగతం పలికి పూలమాలలు శాలువాలతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ ఇంజపల్లి శ్రీనివాస్, పాలకవర్గం సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాసేవలో నిలిచిన అడుగులు చిరస్మరణీయం

## మాజీ వైస్ ఎంపిపి చల్లా నాగిరెడ్డికి ఎమ్మెల్యే దొంతి నివాళులు



**ప్రజాపక్షం/ములుగు:** నెక్కొండ మండల రాజకీయ, సామాజిక రంగాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ వైస్ ఎంపిపి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చల్లా నాగిరెడ్డి మృతి పట్ల నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం నాగిరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, కానీ ప్రజల మనసుల్లో సంపాదించిన స్థానం శాశ్వతం, చల్లా నాగిరెడ్డి ఆలాంటి నాయకుడు, గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు నెక్కొండ ప్రజలకు ఎప్పటికి గుర్తుండిపోతాయన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ పార్టీ బలోపేతానికి విశేషంగా పనిచేసిన నాగిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి, నెక్కొండ ప్రాంతానికి తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల ఇంటి స్థలం ఆక్రమణకు చెక్

## 18 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమి స్వాధీనం



**ప్రజాపక్షం/నెక్కొండ:** పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని ఆక్రమణదారుల నుండి తిరిగి స్వాధీనం చేసుకొని అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తమ నిబద్ధతను చాటింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరుపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 909/బి/3లో ఉన్న 1.20 ఎకరాల భూమిని బుధవారం నర్సంపేట ఆర్‌డిఓ ఉమారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిని 2008లో బలహీన వర్గాల ప్రజలకు గృహ స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకం కింద కొనుగోలు చేసింది. అప్పట్లో భూమి యజమానికి రూ.1.50 లక్షల పరిహారం చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినప్పటికి, అనంతర కాలంలో భూమి ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ రికార్డుల్లో గుర్తించారు. ప్రభుత్వానికి చెందిన ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే క్రమలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నెక్కొండ తహసీల్దారు వి రాజ్‌కుమార్ ముందస్తుగా పోలీసు రక్షణ కోరగా, ఆర్‌డిఓ ఉమారాణి, ఏసిపి రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. పేదల సంక్షేమం కోసం కేటాయించిన భూములను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రభుత్వ ఆస్తులపై ఆక్రమణలను సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమిని త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు గృహ స్థలాలుగా అందించేందుకు చర్య లు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో నెక్కొండ తహసీల్దారు వేముల రాజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, జిపిఓలు పోలీస్ అధికారులు, సిఐ సన్నాయిల శ్రీనివాస్, ఎస్ఐ మహేందర్, పలు శాఖల సం బంధిత అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నా రు.

# 'సర్' పై బిజెపి బిఎల్ఏ -2 కార్యశాల



**ప్రజాపక్షం / నర్సంపేట :** భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ 2026 పై బిఎల్ఏ 2 కార్యశాలను ఎస్ఐఆర్ నియోజకవర్గ కన్వీనర్ రేసు శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చాడ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించబడిందని, ఆ పవిత్రమైన హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యతాని, 2002 తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఎస్ఐఆర్ 2026 ప్రక్రియ ద్వారా చనిపోయినవారు, ఇల్లు మారినవారు, డబుల్ ఎంట్రీల పేర్లను తొలగించి, 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి యువతీ యువకుడిని ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. బిఎల్ఓ, బిఎల్ఏ1,బిఎల్ఏ2 సమన్వయంతో బూత్ స్థాయిలో కట్టుదిట్టంగా పని చేస్తేనే పారదర్శకమైన ఎన్నికలు సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ , 28 వ వార్డ్ కౌన్సిలర్ జూలూరి రోజారాణి , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహ రాములు , పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచంద్రా రెడ్డి , రాష్ట్ర ఒబిసి నాయకులు గడ్డం ఆంజనేయులు , జిల్లా నాయకులు కుంభం కోమల్ రెడ్డి , నల్లబెల్లి మండల అధ్యక్షులు తడుక వినయ్ , దుగ్గొండి మండల అధ్యక్షులు నెదురు రాజేందర్ , నర్సంపేట మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ , నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అనూష అశోక్ , నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు,ముఖ్య నాయకులు,బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా సోమన్న

**ప్రజాపక్షం/పాలకుర్తి:** తెలంగాన రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన చిట్యాల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 16న లింగాలఘనపురం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభలో జిల్లా అధ్యక్షునిగా పాలకుర్తికి చెందిన చిట్యాల సోమన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివిజి రాంజీ చట్టాన్ని అమలు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో పనులు దొరకని పరిస్థితి ఉందన్నారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కూలీలు పనిచేసే స్థలంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**ప్రజాపక్షం/రాయపర్తి:** విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సహేంద్ర బిక్షపతి మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలిక వసతులు కల్పిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, రాధ, నర్సింహులు, ప్రవీణ్ రెడ్డి, సంధ్య, శ్రీనివాస్, దేవేందర్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన

## ఆలయాన్ని సందర్శించిన ఎపి డిప్యూటీ సిఎం పవన్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ట బుధవారం ఉదయం 8.36 నిమిషాలకు పుష్పగురి పీఠాధిపతులు శ్రీ అభినవోద్ధండ విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా జరపడంతో సుసంపన్నమైంది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఇరిగేషన్ ఎస్ఈ హరివెంకటరామ ప్రసాద్, ప్రముఖ వితరణశీలి తొట్రెడ్డి హృదయ్ కుమార్ రెడ్డి అర్చన దంపతులు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణ ప్రసాద్, దాతలు జారతి వెంకటేశ్వర్లు, గోపాల విజయ్‌కుమార్, పుప్పాల శివశంకర్, మూల రాంమూర్తి, బొమ్మగాని కృష్ణమూర్తి, పురం సతీష్ కుమార్‌లతో పాటు, దేవాదాయ చైర్మన్ డాక్టర్ బి శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, పూర్ణచందర్, క్రాంతి, సతీస్, మయూరి రామేశ్వర్‌రావు, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్, శ్రీధర్ రావు, భక్తులు పాల్గొన్నారు. ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి చీర, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సర్పంచ్ కూతురుకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలో బుద్దారం గ్రామ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్ కూతురును ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి నందు బుధవారం అడ్మిషన్ తీసుకొని అందరికి మార్గదర్శకంగా నిలిచారు. తమ కూతుర్ని తమ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని ఉంచినందులకు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తానని గ్రామ సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మారబోయిన ఐలయ్య, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా తీసుకోవాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం మండలంలోని బండ్లగూడ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. విద్యార్థుల విద్యా నైపుణ్యాలను మరింత పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఆన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీలో ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత విద్య జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు పోటీ పరీక్షల్లో రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఆధునిక విద్యను అభ్యసించవలసిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీడీవో గౌసియా బేగం, అధికారులు, కస్తూర్బా గాంధీ ప్రిన్సిపల్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గెస్ట్ టీచర్ నియామానికి దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలం లోని గొల్లకిష్టంపల్లిలోగల కస్తూర్బాగాంధి జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించుటకు గెస్టు టీచర్ పోస్టుకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి మాత్రమే మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ కె స్రవంతి ఒక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసంధర్భంగా స్రవంతి మాట్లాడుతూ దారఖాస్తు దారులు ఏదేని యూనివర్సిటీ నుండి ఎంఎస్సి,బిఇడి పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు ఈనెల 18,19 తేదీలలో హనుమకొండ జిల్లా వేలేరు మండలం గొల్లకిష్టంపల్లిలోని కస్తూర్బాగాంధి కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరుతూ వేలేరు మండలం హనుమకొండ జిల్లా వాస్తవ్యులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వబడునని తెలుపుతూ పూర్తి వివరాలకు 6302494148 నెంబరును సంప్రదించాలని కోరారు.

## కిడ్స్ ప్రీ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** హన్మకొండ జిల్లా హంటర్ రోడ్డులో నేషనల్ మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్స్ ప్రీ స్కూల్ ను స్థానిక వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బుధవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకులు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్కూల్‌లో ఏర్పాటు చేసిన తరగతి గదులు, చిన్నారులకు కల్పించిన విద్యా సౌకర్యాలు, ఆట వస్తువులు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, చిన్నారుల విద్యాభ్యాసానికి పునాది ప్రీస్కూల్ దశేనని, బాలల మానసిక, శారీరక వికాసానికి అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యతో పాటు విలువలతో కూడిన బోధన అందిస్తూ చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఇలాంటి విద్యాసంస్థలు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, స్కూల్ నిర్వాహకులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు లేకుండానే వెంచర్ నిర్మాణం

### దళితుల భూమి ఆక్రమణ ఆరోపణలు



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండల పరిధిలో కాకతీయ వింటేజ్ సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమారు మూడు ఎకరాల భూమిలో వెంచర్ అభివృద్ధి చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే ఆ వెంచర్‌కు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.
వెంచర్‌కు దారి కల్పించేందుకు సమీపంలోని దళితులకు చెందిన భూమిని ఆక్రమిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన దళితులపై సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి దాడికి యత్నించినట్లు వారు పేర్కొన్నారు.ఈ ప్రాంతంలో గజం ధర రూ.30 వేల వరకు ఉన్నట్లు సమాచారం. ఇంత భారీ ధరలకు ప్లాట్లు విక్రయిస్తున్నప్పటికీ, వెంచర్‌కు అధికారిక రహదారి లేకుండా ఎలా అభివృద్ధి చేస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.
దళితుల భూమి ఆక్రమణ ఆరోపణలపై, అలాగే రహదారి అనుమతులు, వెంచర్ లేఅవుట్‌కు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# వార్డు సభ్యులకు సమయపాలన లేదా.?

### వార్డు సభ్యులు ఏం వింటారు..ఏం చేస్తారు



**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండల కేంద్రంలోని రైతు వేదిక యందు మండల పరిధిలోని గ్రామాలలో గల పాలక వర్గ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఐదు రోజులలో భాగంగా బుధవారం (3వ రోజు) శిక్షణ కార్యక్రమం. ఉ.10 గం.ల నుండి సా.5 గంటల వరకు ఉండగా సుమారు ఉ.11:45 వరకు 13 మంది హాజరవడం,మధ్యాహ్నానికి వార్డ్ సభ్యులు 5060 వరకు హాజరవ్వడం గమనార్హం.మేం ఎప్పుడు వస్తే అప్పుడే వింటాం అనే చందంగా తయారైంది.ఈ విషయాన్ని బట్టి చూస్తే వార్డు సభ్యులు సమయపాలన ఎంత వరకు పాటిస్తున్నారో..అధికారులు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని వార్డ్ సభ్యులు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారో అర్థమవుతుంది.ప్రభుత్వం వార్డు సభ్యులకు అధికారులచే శిక్షణ నిర్వహించి,మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నారు.గ్రామపంచాయతీలలో ఎన్ని రకాల నిధులు ఉంటాయని ఏవిధంగా ఖర్చు చేయాలని మీయొక్క విధులు,బాధ్యతలు ఖచ్చితంగా తెలుసుకోవాలని వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తే వీరి సమయపాలన ఏ విధంగా ఉందో,ఏం వింటున్నారో అర్థం కాని చందంగా తయారైందని చెప్పవచ్చును. ఇప్పటికైనా వార్డు సభ్యులు సమయపాలన పాటించి అధికారులు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుంటారని ఆశిద్దాం..

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

### సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కొరకు బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలని కాలేజీ యజమాన్యాలకు విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ బత్తిని సదానందం అధ్యక్షతన హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఆఫీసు నందు బుధవారం వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కొరకు బడుగు బలహీన వెనుకబడిన తరగతుల కొరకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమాజ అభివృద్ధి విద్యా అభివృద్ధి మీదనే ఆధారపడి ఉంటుందని సమగ్ర అభివృద్ధి కొరకు అన్ని వర్గాల ప్రజలకి విద్య అందినప్పుడే సమాజ వికాసం సాధ్యమవుతుందన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించనందున బహుజన విద్యార్థులు బహు బాధలు పడుతున్నారని తక్షణమే యుద్ధ ప్రాతిపదికన ఫీజు బకాయిలు చెల్లించి విద్యార్థిలోకాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాలేజీ యాజమాన్యాలు మానవతా దృక్పథంతో విద్యార్థులకు ఇవ్వవలసిన అన్ని రకాల సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలని కోరారు. సంక్షేమ పథకాల కోసం నిధులను విడుదల చేసే పాలకులు అమలు కాని ఉచిత వాగ్దానాలు చేసే ప్రభుత్వాలు నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ నిధులతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్పులు మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల బీసీ హక్కుల సాధన సమితి ఉద్యమాన్ని ఉధృతం చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రదీప్, బాబు పాల్గొన్నారు

# గ్రామం లో ప్రభుత్వ బడి కే పంపాలని ఏకగ్రీవ తీర్మానం

### ప్రైవేట్ బడులు వద్దు.....మన గ్రామ పభుత్వ బడులే ముద్దు... అంటూ గ్రామంలో తీర్మానం.....



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలంలోని నల్లగుంట గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బడులను పరిరక్షించుట కొరకు బడికి వెళ్లే పిల్లలకు తల్లిదండ్రులను ప్రైవేటు బడి కి పంపకుండా గ్రామం లోని ప్రభుత్వ బడి కి పంపే విధంగా గ్రామ సభ లో గ్రామ పెద్దల సమక్షం లో,పాలకవర్గం సమక్షం లో ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది.గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్ ఉప సర్పంచ్ మోరె లింగస్వామి లు మాట్లాడుతూ గ్రామం లోకి ప్రైవేటు వాహనాలను రాకుండా కట్టుదిద్దమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే మన గ్రామ ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన గ్రామ ప్రజలందరిని చెప్పారు. గ్రామం లోని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ ప్రజలు గ్రామ పాలకవర్గం విద్యార్థుల తల్లిదండ్రులు ఏకమై ప్రభుత్వ బడి కే వెళ్లాలని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య శ్రీదేవి శంకర్ నాయక్, ఉపసర్పంచ్ మోరె లింగస్వామి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,వార్డు మెంబర్లు పొనగంటి రవి,తంగళ్ళపల్లి శ్రీధర్,పిన్ రెడ్డి రమణ రెడ్డి,విద్యార్థుల తల్లిదండ్రులు రామగిరి శ్రీనివాస్,గ్రామ పెద్దలు మందల ప్రభాకర్ రెడ్డి, పోలుదాసరి రవి,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన

### సర్పంచ్ అంబాల రాజు కుమార్



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండలంలోని ఇందిరా నగర్ గ్రామంలో నూతన గ్రామ మహిళా సమైక్య భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్ ఎంపీఓ కె. కవిత హాజరై భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంబాల రాజు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధికి సమైక్య భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సమావేశాలు శిక్షణా కార్యక్రమాలు స్వయం ఉపాధి కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం కేంద్రంగా నిలుస్తుందన్నారు.గ్రామంలోని మహిళలు మరింతగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని వారి సాధికారత కోసం గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి ఎంపీడీవో ఎన్.విజయ్ కుమార్, ఎంపీఓ కవిత తో పాటు ఎల్కతుర్తి సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ కోరేలావణ్య, వార్డు సభ్యులు గ్రామ వివో అధ్యక్షురాలు గొర్రె శ్రీలత, గ్రామ సిఏ.తాడూరి సుమలత, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబాల రమేష్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కడారి రాజారాం, గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా నుంచి తన స్థలాన్ని రక్షించండి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** హంటర్‌రోడ్ శాయంపేటలోని 103 సర్వే నెంబర్‌లోని తన స్థలంలో నిర్మాణం చేస్తుండగా మాదూరీ రంజిత్, మాదూరీ రాజేష్ లు పోలీసుల ఎదుటే తనపై దాడి చేశారని హనుమకొండ అడ్వకేట్స్ కాలనీ కి చెందిన సమరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో బుధవారం సమరసింహ విలేకరులతో తన గోడు వెల్లబోసుకున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం సర్వే నెంబర్ 103లో 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేశానని, ఆ పక్కనే గల సర్వే నెంబర్ 108/సీ సర్వే నెంబర్‌లో వరంగల్ కు చెందిన మాదూరీ రంజిత్, మాదూరీ రాజేష్‌లు బ్యాంకు వేలంపాట నుంచి కొనుగోలు చేసినట్లు సమరసింహ తెలిపారు. వారి సర్వే నెంబర్‌తో పాటు తన సర్వే నెంబర్‌కు ఎంక్రోచ్ చేసుకుంటు నా స్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సర్వే నెంబర్లు వేరే అని అనేక సార్లు చెప్పినప్పటికీ వినకుండా దాడులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై పోలీస్, రెవెన్యూ లు శాఖల సమన్వయంతో ఇప్పటికీ రెండు సార్లు సర్వే చేయించామని, రెండవ సారీ గూగుల్ ద్వారా చేసిన సర్వే సైతం 103 సర్వే నెంబర్‌గా రిపోర్టు వచ్చిందన్నారు. నా స్థలంలోకి ఎంక్రోచ్ అయినట్లు గుర్తించి హద్దులు చూపెట్టాలని కోరుతూ సదరు బ్యాంకు అధికారులకు పోలీసులు లెటర్ పెట్టారని తెలిపారు.అయినా వినకపోవడంతో వారిపై పోలీసులు మూడు చార్జీషీట్లు చేశారని పేర్కొన్నారు.ట్రెస్‌పాస్ కింద మాదూరి రంజిత్, రాజేష్ ల పై కేసు నమోదు చేశారు. అప్పటి వరకు తనకు అనుకూలంగా ఉన్న పోలీసులు మాజీ ఎమ్మెల్సీ ఒత్తిళ్ళతో వెనక్కి తగ్గారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి తనకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారితో తనకు ప్రాణహానీ ఉందని చెబుతున్న పట్టించుకోవడం లేదని పై నుంచి ఇటీవల సుబేదారి పోలీసులు తనపై అనవసరంగా 307 కేసు నమోదు చేశారని తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు చొరవ తీసుకుని బ్యాంకు అధికారులను పిలిపించి మా ఇరువురి స్థలాలకు హద్దులు పెడితే సమస్య సద్దుమణుగుతుందని, దయచేసి తన స్థలాన్ని కబ్జా నుంచి రక్షించి నాకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

# రెడ్‌క్రాస్ సభ్యత్వ ఆహ్వానం

ప్రజాపక్షం/జనగామ టౌన్ : సమాజ సేవపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. డి లవకుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ వివరాలను ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని నమోదు పూర్తయిన వెంటనే సభ్యుల ఈ మెయిల్‌కు గుర్తింపు కార్డు అందుతున్నారు. పేద, ధనిక, స్త్రీ, పురుష అనే తేడా లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో పాటే సేవా దృక్ప కలిగిన వారందరు సభ్యత్వం పొందాలని పిలుపునిచ్చారు.

# ఐఐటిలో జనగామ నారాయణ విద్యార్థుల సత్తా

ప్రజాపక్షం/ జనగామ : జనగామ జిల్లా కేంద్రంలోని నారాయణ ఎస్ఎస్‌సి 202324 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించారు. ఈ సందర్భంగా ఐఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులు అల్లూరి భరద్వాజ, జెస్సికాలను నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిజిఎం రిజ్వాన, పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా మాట్లాడుతూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల విజయానికి రాణ మన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, అకాడమిక్ డీన్ విక్రమ్, ఏట చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తిదారుల మైక్రో ఎటిఎం సేవలు

ప్రజాపక్షం/బచ్చన్నపేట: పాల ఉత్పత్తి దారుల బిల్లుల చెల్లింపులు మరింత సులభతరం చేసేందుకు బచ్చన్నపేట మండల కేంద్రంలో విజయ డైరీ ఆధ్వర్యంలో మైక్రో ఎటిఎం మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నాబార్డ్, డీసీసీబీ బ్యాంకుల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ మైక్రో ఏటీఎం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన నగదు చెల్లింపులు జరుగుతాయన్నారు. మండలంలోని పాల ఉత్పత్తి దారులైన రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బొమ్మెన ఆంజనేయులు, డైరక్టర్లు అగయ్య, వెంకట్ రెడ్డి, కనకయ్య, సత్తిరెడ్డి, రాములు, రాజిరెడ్డి, చంద్రరెడ్డి, కరుణాకర్ రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, డైరీ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడీ బడి బాట కార్యక్రమం

ప్రజాపక్షం/భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 25 వ వార్డు లో కౌన్సిలర్ పానకంటి మేఘన శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడి బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అంగన్వాడి సెంటర్లను ప్రతిష్టాత్మకంగా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 24 వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ డైరెక్టర్స్ నాలిక పరమేశ్వరి, హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ కోమల, సుభాష్ , స్థానిక డాక్టర్ రమేష్, నరసయ్య, వార్డ్ అధ్యక్షుడు వావిళ్ళ స్వామి, అంగన్వాడి సెంటర్ మేడం పద్మ, ఆయా భాగ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# విత్తనాలు ఎరువులు, విక్రయించే దుకాణాల మ్యాపింగ్

## కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి : జిల్లాలోని ఎరువులు, విత్తనాలు విక్రయించే అన్ని దుకాణాలను మ్యాపింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల విక్రయాలు, మ్యాపింగ్, రైతు రిజిస్ట్రీ తదితర అంశాలపై వ్యవసాయ, సహకార, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 38 రైతు వేదికల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 15 రైతు వేదికల మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన 23 రైతు వేదికల మ్యాపింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసు కేసులు నమోదు చేసి, వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు.



మండలాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను సమీక్షించిన కలెక్టర్, జిల్లాలో ప్రస్తుత నమోదు కేవలం 66.77 శాతం మాత్రమే కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన శాతాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార శాఖ అధికారి వాలియా నాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏలు రమేష్, శ్రీపాల్ మరియు అన్ని మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 22న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాపక్షం/జఫర్‌గడ్: ఈ నెల 22న జరుగు ధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. బుధవారం స్టేషన్‌ఘనపూర్ మండలంలోని చాగల్ కేంద్రంలో రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న అధ్యక్షతన జరుగగా ఆమె హాజరై మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల గణనీయంగా ఎరువుల ధరలు పెరిగి రైతులకు భూమి నుండి దూరం చేసే కుట్ర మోదీ ప్రభుత్వం చేస్తుందని రైతులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 22న దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఎరువుల క్రిమి సంహారక మందుల ధరలపై ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. 24న మండల కేంద్రంలో ఆర్యవైశ్య పంక్షన్ హాలులో జరుగుతుందన్నారు. కావున రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజ య్య, జిల్లా కార్యదర్శి సోమయ్య, నాయకులు రమేష్, తోట రమేష్, యాకూబ్ పాషా, సమ్మయ్య, కుమారస్వామి, యాదగిరి, ముసలయ్య, యాదగిరి పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్



ప్రజాపక్షం/భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డీఈవో రాజేందర్ కి వినతిపత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెప్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు, టీచర్ క్వాలిఫికేషన్ నోటీస్ బోర్డు లో పెట్టాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్, టై బెల్టు అమ్ముకాలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ కూడా ధనార్జనయ ధ్యేయంగా విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని కోరారు. పాఠశాలలో ప్రత్యేకగదిలోనే పుస్తకాలను అమ్ముతున్నారని, మా పాఠశాలలోనే పుస్తకాలు ఇతర వస్తువులు కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ, వేల రూపాయలు ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దండుకుంటున్నారని తెలిపారు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో అర్హత లేని వ్యక్తుల విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ ప్రభుత్వ నియమాలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు.ప్రైవేట్ కార్పోరేట్ యాజమాన్యాలు ఇప్పటికైనా ఉపాధ్యాయుల విద్యార్హత తెలిసేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహిస్తామని, పాఠశాల గుర్తింపు రద్దు చేసే విధంగా పోరాటాలు చేస్తామని తెలియజేశారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రత్యేక పూజలు

## బాలాలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణం కార్యక్రమంలో భాగంగా బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల నుండి ఆలయంలో తొలగింపు పూజలు ఘనంగా నిర్వహించారు.ఆలయ ఈఓ మహేశ్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూలు,పండ్లు సమర్పించారు. శృంగేరి జగద్గురు ఆశీస్సులతో క్షేత్రానికి వచ్చిన ఆయన శిష్య బృందం వేద పండితుల ఆధ్వర్యంలో మహాగణపతి పూజ అనంతరం యాగశాల లో ఏర్పాటు చేసిన పంచబ్రహ్మ హోమం,శాంతి పూజలు ,ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు.అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.అలాగే విజయ గణపతి,శుభానంద, మహాసరస్వతి, సుబ్రహ్మణ్య ఆలయాలలో పూజలు నిర్వహించి పంచలోహ బింబాలతో చేపట్టారు.శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతి స్వామి వారు బాలాలయ పూజల నిమిత్తం పంపించిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ద్విలింగాలకు పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ వేదపండితుల వేదమంత్రోచ్ఛరణాల మధ్య అర్చకులు ఊరేగింపుగా తీసుకెళ్లి ఆది ముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాలాలయ మండపంలో శృంగేరి పీఠం శిష్యబృందం ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేశ్,ఆలయ చైర్మన్ మోహన్ శర్మ,ధర్మకర్తలు గందెసిరి సత్యనారాయణ,సుంకరి సీతయ్య,జలవంచ సీతారాం,కుంభం పద్మ,మంచినీల్ల దుర్గయ్య, అశోక్, రాజయ్య, ప్రశాంత్ రెడ్డి,శ్రీధర్ రావ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కొన్నె గ్రామంలో అమ్మబాట అంగన్‌వాడీ బాట

ప్రజాపక్షం/బచ్చన్నపేట: మండల పరిధిలోని కొన్నె గ్రామంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అంగన్వాడి చైతన్య ర్యాలీలో ఆమె గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు, బాలింతలకు ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అంగన్వాడి సిబ్బందికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కమలాకర్, అంగన్వాడి టీచర్లు ఉష, విజయ, పద్మ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం పద్మ, సిద్ధారెడ్డి, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని క్రమబద్ధంగా నిర్వహించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ప్రజాపక్షం/లింగాలఘణపురం: తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా క్రమబద్ధంగా, నిర్వహించాలని, అధికారులకు జన గామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. సూచించారు. బుధవారం, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని వారు ఆకస్మాత్తుగా



తనిఖీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులు సీసీ కెమెరాల పరిధిలో కార్య పాలు నిర్వహించాలని, రైతులకు అన్ని వసతులు కల్పించి అందుబాటులో ఉండాలని, ప్రజాసేవలో పారదర్శకత జవాబు దారి తనం పెంచాలని, రికార్డు నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెంచాలని వారు అన్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ అండాలు, ఆర్ఐ కిషోర్ తదిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రజాపక్షం/జనగామ టౌన్ : జనగామ పట్టణంలోని ధర్మకంచ జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. తొలి బహుమతి ఎం సంయుక్తకు రూ.5వేలు, నౌసిక్ ఫాతిమాకు రూ.3వేలు, సాయి కుమార్, సాయి సిరిలకు రూ.2500, దినేష్‌కు రూ.2వేల నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కేఎల్ఎన్ స్వామి, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ బాధ్యులు భీమ్ రాజు, నరేష్, వినోద్, నరసింహులు, నవీన్, మణి, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ ల్యాబ్ ఏర్పాటుకు అంగీకారం



ప్రజాపక్షం/జఫర్‌గడ్: విద్యార్థులకు తరతరాల చరిత్ర, వారసత్వ సంపద, జానపద విజ్ఞానం, సామాజిక శాస్త్రాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో జఫర్‌గడ్ ఉన్నత పాఠశాలలో సోషల్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారు.ఈ మేరకు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి సూచనలతో సముద్రాల రాజు పాఠశాల హెచ్ఎం గోపిరెడ్డి పద్మ, సోషల్ టీచర్ చాడ రజితలకు వినతిపత్రం అందజేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం సోషల్ ల్యాబ్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించి అంగీకారం తెలిపింది. సోషల్ ల్యాబ్ విద్యార్థులలోపరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు వారి ఆలోచనా పరిధిని విస్తృతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పాఠశాల త్వరలోనే ల్యాబ్ ఏర్పాటుకు సంబంధించిన కార్యచరణ ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.

## పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత అవగాహన



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలో గ్రామంలోని మెదక్ జిల్లా పోలీసుల కళాబృందం హెడ్ కానిస్టేబుల్ సురేందర్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ, ఫైబర్ నేరాలపై, రోడ్డు భద్రత పై, బాల్య వివాహల పై, కళాజాత ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ ప్రాధాన్యత, సెల్ ఫోన్ వినియోగం, విద్యార్థుల భవిత, అమ్మ నాన్నల విలువ, చదువు సంస్కరణ విలువ, రైతు ఆత్మహత్యలు, మూఢనమ్మకాలపై పాటలు మాటలతో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దేవరాజు యాదవ్, హెడ్ కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుల్ నవీన్, నాగరాజు, వార్డు సభ్యులు, కారోబార్ ఎల్లారెడ్డి, నర్సింలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిఎస్‌తో విద్యను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/రామాయంపేట:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీపీఎస్ పేరుతో విద్యను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు ఆరోపించారు. బుదవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వంద టీపీఎస్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికి ఇప్పటి వరకు కేవలం ఒకటి మాత్రమే అందుబాటులోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి సుమారు మూడేళ్లు అవుతున్న టీపీఎస్ పాఠశాలలపై నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారో తెలియడంలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటికి ఉపాధ్యాయుల కొరత, మౌళిక వసతులతో కొట్టుమిట్టాడుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## పారిశుద్ధ్య కార్మికుల కృషి ఆపారమైనది



**ప్రజాపక్షం /కొండాపూర్:**గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల కృషి ఆపారమైనదని గుంతపల్లి సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి కొనియాడారు. పరిశుభ్రత కోసం ఆహర్నిశలు కష్టపడే సిబ్బందిని అభినందించారు. బుధవారం జాతీయ పారిశుద్ధ్య కార్మికుల దినోత్సవం సందర్భంగా గుంతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రంలో పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు ,శ్రీపాల్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా రత్న జాతీయ ఆవార్డు అందుకున్న కల్యాణ్‌కుమార్



**ప్రజాపక్షం /హత్నూర:**హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన అందోలు కల్యాణ్ కుమార్ సేవలను గుర్తించి స్ఫూర్తి సోసైటీ ఇండియా ఎన్‌జిఓ వారు సేవా రత్న జాతీయ ఆవార్డు ఎంపిక చేశారు. ఈ ఆవార్డు ఎన్జిఓ పౌండర్ ,చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా మంగళవారం హైదరాబాదులోని కళా భారతిలో జరిగిన కార్యక్రమంలో ఆవార్డు తీసుకోవడం జరిగిందని ఆవార్డు గ్రహీత అందోల్ కళ్యాన్ కుమారు తెలిపారు. కాగ గత 10 సంవత్సరాలుగా అందోలు కల్యాణ్ కుమార్ కళ్యాన్ సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఎంతో మందికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అదే విధంగా తన సొంత డబ్బులతో 50 మందికి పైగా పేదవారికి బట్టలు ,చనిపోయిన పేద కుటుంబాలకు ఆర్థికసహాయంగా ఆదుకోవడం జరిగింది. గ్రామంలోని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెసులు నోట్ బుక్స్‌లు ,వాలి బాల్ టోర్నమెంట్ కబడ్డీ, టోర్నమెంట్‌లు నిర్వహించడం జరిగింది. గడిచిన రెండేళ్ల కాలంలో కాసాల రెడ్డి ఖానాపూర్ గ్రామాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని విధ్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో వెళ్లడానికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అదే విధంగా అంబెద్కర్ జయంతి సందర్భంగా యువకలుకు వాలీబాల్ మెటీరియల్ పంపిణిచేయడం జరిగింది. ఈ విధంగా అందోలు కల్యాణ కుమార్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి వారి సమస్యలు తెలుసుకొని ఆ సమస్యల పరిష్కారం దిశగా వెళ్తున్నాడు. ఆయన సేవలను గుర్తించిన స్ఫూర్తి సర్వీసెస్ సోసైటీ వారు ఆయనకు హైదరాబాద్‌లోని కళా భారతిలో జాతీయ స్ఫూర్తి సేవా రత్న జాతీయ ఆవార్డు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కళ్యాన్ కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి స్ఫూర్తి సర్వీసెస్ సోసైటీ వారి ద్వారా ఆవార్డు తీసుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/వెల్దుర్తి:**రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో పూర్తిగా విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ తండాలో గ్రామపంచాయతీ బిల్డింగ్ భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంలో గ్రామపంచాయతీ ల దగ్గర గ్రామసభలు పెడుతున్నారు తప్ప గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని గతంలో కేసీఆర్ హయాంలో పల్లె ప్రగతి లో భాగంగా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు ఇచ్చి పల్లె ప్రకృతి వనాలు వైకుంఠధామాలు గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రపరచడం క్రీడా ప్రాంగణాలు తదితర అభివృద్ధి పనులు చేశామని ఆమె తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ అభివృద్ధి అంతా కుంటుపడిందని ఆమె అన్నారు గ్రామ పంచాయతీ లకు రావాల్సిన నిధులు కూడా ఇప్పటివరకు రాలేదని కాంగ్రెస్ పార్టీ వస్తే మార్పు జరుగుతుందని, అనుకున్న ప్రజలకు ఏ మార్పు జరగలేదని ధాన్యం కొనుగోలు పూర్తిగా విఫలమైందని సన్న వడ్లకు బోనస్ ఇప్పటివరకు రాలేదని మహిళలకు 2,500 ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదని పెన్షన్లు 4000 రూపాయలకు పెంచుతామని ఇప్పటివరకు పెంచలేదని నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని 6 గ్యారంటీ అమల్లో పూర్తిగా విఫలమైందని ఆమె అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచిందని ఆమె అన్నారు మళ్లీ రాబోయే రోజుల్లో కెసిఆర్ ప్రభుత్వాన్ని తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్, మాసాయిపేట మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మాసాయిపేట తాసిల్దార్ జ్ఞాన జ్యోతి, రామంతపూర్ తాండ సర్పంచ్ చందర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ



**ప్రజాపక్షం/మెదక్ :** కళాభారతిలో నిర్వహించినటువంటి తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర, మెదక్ జిల్లా కమిటీ నియామకం సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా మెదక్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు గుడాల సత్య నారయణ ను రాష్ట్ర కమిటీ నియమించారు. ఈ సందర్భంగా గుడాల సత్యనారాయణ మాట్లాడుతూ 14 సంవత్సరాలు అలుపెరుగని పోరాటంలో ఉద్యమ కళాకారులు తెలంగాణ సాధించడానికి ఎంతగానో కృషి చేశామని తెలిపారు. గత ప్రభుత్వం కళాకారులకు అండగా నిలుస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచి మొండి చేయి చూపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టోలో తెలిపినప్పటికీ మూడు సంవత్సరాలు కావస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కళాకారులు ఇబ్బందులకు గురై మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కళాకారులపై ప్రేమ చూపి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా నిరుద్యోగ కళాకారుల అండగా నిలుస్తారని ఆశతో ఉన్నాం అన్నారు. జై ఉద్యమ కళాకారులు అని నినాదాన్ని తెలిపారు.

## జాతీయ ఆవార్డు అందుకున్న పలంచ రాజీవ్ గాంధీ



**ప్రజాపక్షం /హత్నూర :**హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన పలంచ రాజీవ్ గాంధీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ ఆవార్డు కు ఎంపికయ్యారు. ఈ ఆవార్డు ఎన్‌జిఓ పౌండర్ ,చైర్మన్ లయన డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా మంగళవారం తీసుకోవడం జరిగిందని ఆవార్డు గ్రహిత పలంచ రాజీవ్ గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషన్ ఆవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మండలంలోని దళిత సామాజిక వర్గంలో ఉన్న యువత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు తెలియజేశారు. భవిష్యతులో అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని శివ్వంపేట ఎస్ఐ మదుకర్‌రెడ్డి అన్నారు. ప్రయివేట్ పాఠశాలలు పునఃప్రారంభంలో విద్యార్థుల భద్రత దృష్ట్యా అన్ని ప్రయివేట్ పాఠశాల స్కూల్ బస్సులను బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రయివేటు పాఠశాలలకు తీసుకెళ్లే బస్సులు ఫిట్‌నెస్ లేకపోతే తప్పకుండా చర్యలు తీసుకుంటామని, వేగాన్ని తగ్గించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన అవసరం ఉందని డ్రైవర్లకు సూచనలు చేశారు. ప్రతీ బస్సు డ్రైవర్‌కు లైసెన్సులు తప్పకుండా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రతీ బస్సులో ఫైర్‌గ్యాస్ తప్పకుండా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రయివేటు బస్సుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాల్సిన అవసరం బస్సు యాజమాన్యాల మీద ఉందని ఆయన గుర్తుచేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ ధర్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థంలో కార్యక్రమాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/పాపన్నపేట:**మండల పరిధిలోని రామతీర్థం లో దేవరింటి పార్వతమ్మశేఖరప్ప దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గృహ యజమానులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ సాయిరెడ్డి తండ్రి మాణిక్యరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిరెడ్డితో మాట్లాడి మాణిక్యరెడ్డి ఆరోగ్య పరిస్థితిని, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, రామతీర్థం సర్పంచ్ సాయి రెడ్డి, మాజీ సర్పంచులు బాబా గౌడ్, దుర్గయ్య, గురుమూర్తి గౌడ్, లింగా రెడ్డి, శ్రీనాథ్ రావు, నాయకులు శ్రీనివాస్, నవీన్, స్వామి, చంద్రమోహన్ గౌడ్, వినయ్, సాయి పాల్గొన్నారు.

## అనుమతి తీసుకొని నిర్మాణం జరుపుతున్నాం



**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ పట్టణంలోని ఆరో వార్డు కాజీ గల్లీలో నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణానికి మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని నిర్మిస్తున్నామని ఇంటి యజమాని మహమ్మద్ అసలుద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేము నిర్మాణం చేపడుతున్న ఇండ్లను కావాలని కొందరు ఫంక్షనల్ నిర్మిస్తున్నామని ఆరోపించడంలో ఎటువంటి నిజం లేదన్నారు నిజం లేదన్నారు. ఈ ఇండ్ల నిర్మాణంలో తనకు టెంట్ హౌస్ దుకాణం ఉన్నందున టెంట్ హౌస్ సామాగ్రి పెట్టడానికి విశాలంగా ఆల్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాలు చూసి కొందరు ఫంక్షనల్ హాల్ అని అపోహ పడ్డారని, దాంట్లో వాస్తవం లేదని ఆయన స్పష్టంగా తెలిపారు. అయితే కొందరు 1000 గజాల్లో ఫంక్షనల్ నిర్మిస్తున్నారని అనడంతో మున్సిపల్ అధికారులు వచ్చి కొలతలు చేయగా 423 గజాలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు నిర్ధారించారని తెలిపారు.

# గార్లలో ఉద్రిక్తత ఆర్‌డిఒను అడ్డుకున్న రైతులు

### భారీ బందోబస్తు నడుమ భూ సర్వే
### కాలువ సర్వేను ఎంఎల్‌ఎ కలుగజేసుకుని అడ్డుకోవాలని రైతుల డిమాండ్



ప్రజాపక్షం/గార్ల : గార్ల లో ఉద్రిక్తత పరిస్థి భారీ పోలీసు బలగాల తో మున్నేరు కాలువ సర్వేకు వచ్చిన ఆర్‌డిఒ రాజేశ్వరి, సంబందితఅధికారులను అడ్డుకున్న 2 వందల మంది గిరిజన భూ నిర్వాసిత రైతులు మండుటెండలో నిరసన, కాలువ సర్వేను పూర్తిగా విరమించి మా భూములను మా నుండి లాక్కోవద్దని డిమాండ్ చేసారు. గిరిజన ఏట్లతో గెలిచిన గిరిజన ఎంఎల్‌ఏ గిరిజన రైతులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకుపోవడంపై మహిళా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఎంఎల్‌ఏ చొరవ తీసుకుని భూ సర్వేను నిలిపివేయాలని డిమాండ్ చేసారు. గార్ల మండలం లో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న మున్నేరు నుండి వరద నీటిని లింకు కాలువ ద్వారా సీతారామ ప్రాజెక్ట్ కాలువకు అనుసంధానం చేసేందుకు మండల పరిదిలోని పలు గ్రామాలలో అధికారులు భూ సర్వే నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో బుదవారం రోజు భారీ పోలీసు బలగాలతో సంబందిత అధికారులు తిర్లాపురం,కంసిలి తండా, వెంటాపురం, గ్రామాల పరిదిలో సర్వే నిర్వహించేందుకు చేరుకోగా, అయా గ్రామాల భూ నిర్వాసిత రైతులు మండు టెండను లెక్కచేయకుండా అధికారులను అడ్డుకొని నిరసన తెలిపారు. ఎకరం,అరేకరం, ఇలా అరకొర భూములను సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న మా భూములను లాక్కొని మా కుటంబాలను రోడ్డున వేయద్దని భూ నిర్వాసిత గిరిజన మహిళా రైతులు ఆర్టిఓ,స్థానిక తహశీల్దార్,లను ఆగ్రహంతో నిలదీసారు. గిరిజన రైతులకు అండగా జలసాదన సమితి నిలిచి నిరసనలో భాగస్వామ్యయ్యారు. ప్రభుత్వం నుండి ఎకరానికి 20లక్షల లోపు నష్టపరిహారం అందేలా కృషిచేస్తానని ఆర్టిఓ రాజేశ్వరి రైతులను శాతింపజేసే ప్రయత్నం చేయగా, రైతులు ఒప్పుకోకుండా మా భూముల జోలికి రావద్దంటూ సాయంత్రం అరుగంటల వరకు అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. భారీ ఎండల వలన బందోబస్తుకు వచ్చిన కొందరు పోలీసులు అస్వస్థతకు గురి అయ్యారు. రైతుల ఆందోళనతో చేసేది ఏమిలేక సంభందిత అధికారులు పోలీసులు వెనుదిరిగారు.

## విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికై కృషి చేయాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ప్రజాపక్షం/వరంగల్‌క్రైమ్ : నిరంతరం విధినిర్వహణలో భాగంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తునే తమ పిల్లల అభ్యున్నతి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ప్రతిష్టాత్మకమైన ముంబాయి ఐఐటీ కళాశాలలో అడ్మిషన్ సాధించిన ఇన్స్‌స్పెక్టర్ కుమార్తెను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ తనయురాలు యడ్లపల్లి సాత్విక జెఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించగా, ఇటీవల నిర్వహించిన జె.ఇ.ఇ అడ్వాన్స్ పరీక్షల్లో రాణించి 8808 ర్యాంక్‌తో ముంబాయి ఐఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీటు సాధించడం జరిగింది. దీనితో సాత్వికను వరంగల్ పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా సిపి సాత్వికతో ముచ్చటిస్తూ రాబోవు రోజుల్లో మరింత కష్టపడాల్సి వుంటుందని. దేశంలోనే అత్యున్నతమైన విద్యా సంస్థలో సీటు సాధించడం గొప్ప విషయమని, ఇదే రీతిలో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ముఖ్యంగా నిరంతరం విధుల్లో వుండే పోలీసుల పిల్లలు గత కొద్ది సంవత్సరాలు చదువుల్లో రాణించడం, ఉన్నత ఉద్యోగాలను సాధించడం సంతోషాన్ని కలిగిస్తోందని సిపి తెలియజేసారు.

## వ్యాపారవేత్త రవీందర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వరంగల్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆడెపు రవీందర్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమంగా హనుమకొండలోని రెడ్ క్రాస్ సంస్థలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని యువనేతాజీ ఫౌండేషన్ బాధ్యులు కొత్తకొండ అరుణ్, కన్నె రాజు తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమానికి రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులతో పాటు సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ హాజరై రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా రక్తదాన శిబిరం వంటి సామాజిక ప్రయోజనకర కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని శ్రీనివాస్, తదితరులు రవీందర్‌ను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ప్రజాపక్షం/కురవి: ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డ్ డిడిఎం శ్రీరామ్ అన్నారు. బుధవారం కురవి మండలం నేరడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంక్ మేనేజర్ సింధు అధ్యక్షతన నిర్వహించగా గ్రామ సర్పంచ్ గౌతమి, నాబార్డ్ డిడిఎం శ్రీరామ్, ఎల్‌డిఎం యాదగిరి, కురవి దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బ్రాంచ్ మేనేజర్ సింధు, నాబార్డ్ డిడిఎం శ్రీరామ్‌లు మాట్లాడుతూ పొదుపు ప్రాముఖ్యత, పిఎం జీవన్‌జ్యోతి భీమా యోజన, పిఎం సురక్ష భీమా యోజన, కేవైసి, రీకేవైసి లతో పాటు బ్యాంక్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని, ప్రభుత్వ భీమా పథకాలలో చేరి ఆర్థిక భద్రతను పొందాలని ఎఫ్‌ఎల్‌సి నుక్కడ్ వై.రమేష్ కళాబృందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంపెల్లి సెక్రటరీ శ్రీమాన్, నేరడ ఉపసర్పంచ్ వెంకన్న, రైతులు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన రాంప్రసాద్

ప్రజాపక్షం/నర్సింహులపేట: నర్సింహులపేట నూతన ఇంచార్జ్ ఎంపిడిఒగా రాంప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపిడిఒఅంజలి లీవ్‌లో ఉండగా ఇంచార్జ్ ఎంపిడిఒగా పెనుగొండ రాధిక నియమాకం అయ్యారు. ఇటీవల ఎసిబి అధికారులు నిర్వహించిన దాడుల్లో పెనుగొండ రాధిక పట్టుబడటంతో ఇంచార్జ్ ఎంపీడీవోగా ప్రభుత్వం రాంప్రసాద్‌ను నియమించింది.గతంలో గంగారం మండల ఎంపిడిఒగా విధులు నిర్వహించిన రాంప్రసాద్ పదోన్నతిపై నర్సింహులపేట ఇంచార్జ్ ఎంపిడిఒగా విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆఫీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మండల పరిదిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.మండల ప్రజలు ప్రజాప్రతినిధులు,అధికారులు కార్యాలయ పనితీరుకు సహకరించాలని కోరారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అవినీతి రహిత పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.కాగా నూతన ఎంపిడిఒను పలువురు ప్రజాప్రతినిధులు,కార్యాలయ అధికారులు సన్మానించారు.

## బాలసముద్రంలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : 30వ డివిజన్ పరిధిలోని బాలసముద్రం కి చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు, యువకులు బుధవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ప్రజా ప్రభుత్వ లక్ష్యాలు, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరగడంతోనే పెద్ద ఎత్తున పార్టీ చేరికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.బాలసముద్రం ప్రాంత అభివృద్ధి, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సూచించారు.కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తోట పవన్, స్వామి, శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

## మరిపెడ మున్సిపాలిటీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### సిపిఐ డిమాండ్



ప్రజాపక్షం/మరిపెడ: మరిపెడ మున్సిపాలిటిలో నేలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ వినరపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ని కలిసి పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతు వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మట్లడుతూ,మరిపెడ మున్సిపాలిటి పరిధిలోని పలు వార్డులలో చెత్త సేకరణ సరిగా జరుగడం లేదని,పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేస్తూన్నారని,వీధి దీపాలు వేలుగడం లేదని,ముఖ్యంగా అంగడి ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోందని,అక్కడ తాత్కలికంగా కొనసాగిస్తోన్న పిహెచ్‌సి కి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరని,అంగడి అవరణలో వీధి దీపాలు వేలగడం లేదని,మున్సిపాలిటిలో ప్రదనంగా వ్యాపారం జరిగే రాంవిలాస్ గల్లి రోడ్డు విస్తరణ,సిసి రోడ్డు పనులు సుదీర్ఘంగా నిలిచి పోయాయని అవి వేంటనే పూర్తి చేయలని,కోత్తతండకు వెళ్ళే రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయలని,అపరిష్కతంగా ఉన్న అనేక పనులను పూర్తి చేయలని అయన డిమాండ్ చేశారు.

## అసాధారణ ప్రతిభ కనబర్చిన రిత్విక్

ప్రజాపక్షం/సంగారెడ్డి : కంది మండల కేంద్రానికి చెందిన మన్నె సుప్పు ,మల్లేశంల తనయుడు మన్నె రిత్విక తొమ్మిదేళ్ల వయస్సులోనే అసాధరణ ప్రతిభ కనబరిచి కరాటేలో అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్లాక్ బెల్ట్ సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు సంగారెడ్డిలో కరాటే గ్రాండ్ మాస్టర్ వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రిత్విక్ బ్లాక్ బెల్ట్ సాధించారు. కరాటే మాస్టర్ పోచయ్య వద్ద శిక్షణ తీసుకొని అతి చిన్న వయస్సులోనే ఈ ఘనత సాధించడం విశేషం ,రిత్విక్ సాధించిన ఈ విజయంపై కుటుంబసభ్యులు ,ఉపాధ్యాయులు ,స్నేహితులు ,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



ప్రజాపక్షం/తొర్రూరు : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో డాక్టర్ శ్రీనివాస్ ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్‌ను డాక్టర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణుల వైద్య సేవలు పొందవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను ఎమ్మెల్యే పరిశీలించి డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కౌన్సిలర్లు ముద్దసాని సురేష్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యుల, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

### సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

ప్రజాపక్షం/కొండాపూర్ : కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గ్రామ ప్రధాన రహదారి సిసి రోడ్డు పనులను గొల్లపల్లి సర్పంచ్ గడీల శ్రీనివాస్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన సమస్యగా మారిన రోడ్డు పనులను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈరోజు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ రోడ్డు వేయడంతో గొల్లపల్లి గ్రామ ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు ప్రయాణం చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## భవిష్యత్ పునాది అంగన్‌వాడీ విద్యనే..



### సర్పంచ్ బుర్ర మురళీగౌడ్

ప్రజాపక్షం/శివ్వంపేట : చిన్నారుల భవిష్యత్తుకు పునాది అంగన్‌వాడీ విద్యనే అని సర్పంచ్ బుర్ర మురళీగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి లతో కలిసి స్కూల్ యూనిఫాం చిన్నారుల తొలిమెట్టుగా అక్షరభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అక్షర పాయింట్స్ అక్షరభ్యాసం చేయించడం వల్ల పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంగళపర్తి స్వామియాదవ్, వార్డు సభ్యులు పిల్లి లలిత, మధు, గుల్లయ్యగారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారి లక్ష్మణ్

ప్రజాపక్షం/అల్లాదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని మండల విద్యాధికారి లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలో గల చిల్వర్ జెడ్పి హెచ్ఎస్ హైస్కూల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. చేవెళ్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ మచ్చందర్, ఉపసర్పంచ్ నాగన్న, ఎంఈఓ లక్ష్మణ్ కలిసి చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని గ్రామ సర్పంచ్ మచ్చేందర్ తెలిపారు. విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాల అధిరోహించాలని కోరారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల హక్కులను కాలరాస్తున్న మోదీ

### కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 6-14వరకు దేశవ్యాప్తంగా దేశ వ్యాప్త ర్యాలీలు.



ప్రజాపక్షం / హుస్నాబాద్ : జూన్ 17 . కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం గత 5 రాష్ట్రాల ఎన్నికల్లో వరుస విజయాల అహంకారంతో చట్టాలను తన కు అనుకూలంగా సవరణ చేస్తు మళ్లీ ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లను తొలగిస్తు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజల హక్కులను కాలరాస్తు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లను తెలగించే కుట్ర చేస్తుదని సీ పీ ఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సీ పీ ఐ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నేడు ప్రజాసామ్యంలో న్యాయ వ్యవస్థ పూర్తిగా కనుమరుగైందన్నారు. కార్మికుల 29 హక్కులను కాలరాచిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తామని అన్నారు. ఆక్టోబర్ 1 చలో డిల్లీ ఆందోళన బాట పడుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీల్లో ఇచ్చిన అనేక సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో పెండిగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజుల బకాయిలనే వెంటనే విడుదల చేయాలని గత ప్రభుత్వంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండిగ్ బిల్లును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుబరోస రైతులకు వారి ఖాతల్లో జమచేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ను నిజమైన పేదలకు అందేవిధంగా చూడలన్నారు. పెంచిన ఫించన్లు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీ ఐ నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, నియోజకవర్గ కార్యనిర్వాహకయ కార్యదర్శి సత్యానారయణ, పద్మ, పాల్గొన్నారు.

## ప్రాధాన్యత రంగాల ఋణాల లక్ష్య సాధనకు బ్యాంకులు కృషి చేయాలి

### అదనపు కలెక్టర్ పాండు




ప్రజాపక్షం/సంగారెడ్డి : జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు ఋణాలు మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లో మార్చి 2026 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ పాండు అధ్యక్షత వహించగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టీ. సుధీర్ కుమార్ సమావేశాన్ని సమన్వయం చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ వెన్న ,నాబార్డ్ ఏజీఎం /డీడీఎం కృష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు అన్ని బాంకుల కంట్రోలర్ల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా బ్యాంకింగ్ కార్యకలాపాలపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సుదీర్ కుమార్ సమగ్ర నివేదిక సమర్పించారు. జిల్లాలలో పంట ఋణాల లక్ష్యం రూ. 3,499.21 కోట్లకు గాను , 90.66 శాతం మొత్తం వ్యవసాయ ఋణాల లక్ష్యం రూ. 6,816.57 కోట్లకు గాను 87.16 శాతం మొత్తం అడ్వాన్సుల లక్ష్యం 23,438.93 కోట్లకు గాను 92.81 శాతం సాధించినట్టు వివరించారు. అదే విధంగా విద్య ఋణాల ,గృహఋణాలు సూక్ష్మ ,చిన్న ,మధ్యతరహా పరిశ్రమల ఋణాలు ,స్వయం సహాయక సంఘాల ఋణాలు తదితర రంగాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించి అర్హులైన లబ్దిదారులకు సకాలంలో ఋణాల అందించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఆర్బీఐఏజిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో ప్రధానమంత్రి జనసురక్ష,, పథకాలైనప్రధాన మంత్రి జనధన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, బీమా యోజన ,ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన అటల్ పెన్షన్ యోజన, పథకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మరింత మంది లబ్దిదారులను చేర్చాలని సూచించారు. అలాగే రీకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం ఖాతాలను నిరంతరం సక్రియంగా నిర్వహించుకోవడం గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ మాట్లాడుతూ వ్యవసాయ మౌళిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు ,పశుసంవర్ధక , మత్స్యరంగ ఋణాలు కింద అర్హులైన రైతులు ,లబ్దిదారలకు ఋణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, తుల్జానాయక్, ఎస్సీ ,ఎస్టీ బీసీ కార్పోరేషన్లు ,డీఆర్‌డీఏ, డీఐసి తదితర విభాగాల అదికారులు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

### మాజీ జడ్‌పిటిసి సభ్యులు గడీల శ్రీకాంత్‌గౌడ్

ప్రజాపక్షం/పటాన్ చెరు : పటాన్‌చెరు మండల చిట్కుల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 329 కాలనీలో నెలకొన్న గృహ నిర్మాణ సమస్యలపై మాజీ జడ్పీటీసీ సభ్యులు గడీల శ్రీకాంత్‌గౌడ్ ,గ్రామ పెద్దలు కాలనీ ప్రజలతో కలిసి సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు ,భూ హక్కులు ,ఇతర పరిపాలన సమస్యలను శ్రీకాంత్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. గతంలో చిట్కుల్ గ్రామంలోని సర్వే నెంబర్ 329లో పేదలకు ఇచ్చినటువంటి పట్టా సర్టిఫికెట్లకు సంబంధించిన అనేక ఆరోపణల నేపథ్యంలో నేడు రెవెన్యూ యంత్రాంగం అక్రమ కట్టడాలను కూలగొట్టడం జరిగింది. ఇందులో బాగంగా నిజమైన లబ్దిదారులకు ఇండ్లను కూలగొడుతున్న విషయం తెలుసుకున్న పటాన్చెరు మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ అక్కడికి విచ్చేసి నిజమైన లబ్దిదారుల ఇళ్లను కూలగొట్టకుండా ఆపివేయడం జరిగింది. ఈ సందర్భంగా నిజమైన లబ్దిదారులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. అనంతరం సంబందిత అధికారులతో మాట్లాడి మండల రెవెన్యూ (అధికారి ) ఎమ్మార్వో ,జిల్లా కలెక్టర్ తో చర్చించి 329 సర్వే కాలనీలో నివస్తున్న కుటుంబాలకు గృహ నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం కల్పించేలా కృషి చేస్తామని తెలియజేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని కాలనీవాసులందరికి భరోసా కల్పిస్తూ త్వరలోనే సానుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు చేపడతామని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాలనీ ప్రతినిధులు ,స్థానిక ప్రజలు ,పలువురు నాయకులు పాల్గొన్నారు.



## పుల్కల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రభవన పరిశీలన

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారి కె. లలితా దేవి

ప్రజాపక్షం/సంగారెడ్డి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. లలితా దేవి బుదవారం నాడు పుల్కల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాభావనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల నాణ్యత ,మౌలిక సదుపాయాలు ,విద్యుత్ ,తాగునీటి సౌకర్యాలు ,పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులు , జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు ఔషధ నిల్వలు సిబ్బంది హాజరు రిజిస్టర్లు ,నివేదికలను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. తదుపరి గొంగ్లూర్ ఉప కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలు ,బాలింతలు ,శిశువులకు అందిస్తున్న సేవలు, టీకాకరణ కార్యక్రమం ,కుటుంబ నియంత్రణ సేవలు ,గ్రామస్థాయిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఉప కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపి సేవలు, ల్యాబ్ సేవలు, ఔషధాల లభ్యత మాతా శిశు ఆరోగ్య సేవలు ,పారిశుద్ధ్య నిర్వహణ ,రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమావేశమై ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు ,సూపర్వైజర్లు ,ఏఎన్ఎంలు ,ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వారి సన్నిధిలో సంగారెడ్డి నియోజవర్గ ఎమ్మెల్యే చింతాప్రభాకర్

ప్రజాపక్షం/సంగారెడ్డి : సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపి విరామ దర్శన సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సుఖశాంతులతో ఉండాలని సంగారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి చెందాలని స్వామి వారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వామి వారి శేషవస్త్రాలు కప్పి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

## యువత నైపుణ్యం గల రంగాన్ని ఎంచుకోవాలి

### వంగ రాజేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్: నేటి యువత తమకు ఉన్న ప్రతిభను గుర్తించి,నైపుణ్యం గల రంగాన్ని ఎంచుకొని రాణించాలని సీనియర్ నాయకుడు వంగ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలోని 16వ వార్డులో వరుణ్ స్థాపించిన వైబ్ క్రాఫ్ట్ మార్కెటింగ్ ఆఫీస్‌ను బుధవారం వంగ రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలోకి రావడం శుభ సూచకమని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రంగంలో స్థిరపడుతూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వరుణ్ టీంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవ**

**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఏకంగా రూ. 5 కోట్ల 25 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం,సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల రామగిరి, మండలంకు రూ. 2 కోట్ల 55 లక్షలు, రామగిరి మండలంకు రూ. 90 లక్షలు, ముత్తారం మండలంకు రూ. కోటి రూపాయలు, (పంచాయతీ భవనంతో కలిపి), కమాన్‌పూర్ మండలంకు రూ. 60 లక్షలు, పాలకుర్తి మండలంకు రూ.20 లక్ష లు మంజూరు అయ్యాయి.

## పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించండి

**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామస్తులందరూ సకాలంలో నల్లా,ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి కోరారు.బుధవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో చెల్లించాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సకాలంలో స్పందించి నల్లా,ఇంటి పన్నులు చెల్లించడం ద్వారా గ్రామపంచాయతీ ప్రగతికి సహకరించాలని కార్యదర్శి మల్లేశ్వరి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన యువకులు గడ్డం సంతోష్,గడ్డం వెంకటేష్ లు వారితో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు బుధవారం రామగిరి మండలం సుందిల్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పా ర్టీలోకి ఆహ్వానించారు. సుందిల్ల గ్రామంనికి చెందిన భోగిరి రవళి దివాకర్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన మల్లేశం

**ప్రజాపక్షం / జమ్మికుంట :** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా రుద్రాక్షల మల్లేశం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ రైతులు పండించిన పంట దళారులకు విక్రయించకుండా నేరుగా మార్కెట్ కు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. మల్లేశం గతంలో వ్యవసాయ మార్కెట్‌లో విధులు నిర్వహించిన అనుభవం ఉంది. మార్కెట్ కార్యదర్శిగా మళ్లీ మల్లేశం పదవీ బాధ్యతలు స్వీకరించడం పట్ల రైతులు, అడ్తి వ్యాపారులు తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## స్కూల్ పిల్లలకు బస్సు సౌకర్యాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/రామగిరి :** ఎనిమిదవ ఇంక్లైన్‌లో సింగరేణి హైస్కూల్‌లో ప్రవేశపెట్టి గత సంవత్సరం బస్సును టెండర్ ప్రక్రియ దశలో ఉన్నదని చెప్పుకుంటూ వచ్చి ఇప్పటివరకు అది టెండర్‌లో ఉందా టెండర్ దశలో ఉందా కాంట్రాక్టర్లు వేయలేదా పిల్లలకు యాజమాన్యాలు చెప్పడం లేదు ఈ బస్ కూడా ఎగనామం పెడదామని చూస్తున్న అర్జీ 2 యాజమాన్యంస్కూల్లో చదువుతున్న సింగరేణి కార్మికుల పిల్లలకు బస్సు సౌకర్యాన్ని ఎత్తివేయడాన్ని విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యతోపాటు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉన్నది కాబట్టి అలాంటి సమయంలో రవాణా సౌకర్యాన్ని ఎత్తివేయడం విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారు. సెంటినరీ కాలనీ నుండి ఎనిమిదోవ కాలనీకి ఆటోలలో స్కూలుకు పిల్లలను పంపడం తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడుతున్నారనీ సింగరేణి కాలరీస్ కంపెనీ కార్మికుల పట్ల కార్మిక కుటుంబాల పట్ల విద్యా పట్ల ఎంత నిర్లక్ష్యము చేస్తున్నదో కార్మికులందరూ గమనిస్తున్నారు.రాజకీయ నాయకులు కోసం సింగరేణి యాజమాన్యం మీటింగులకు ఎంత ఖర్చు అయినా పెట్టడం అలవాటు అయినది కంపెనీకి కంపెనీలో మిషనరీ కి కావాల్సిన స్పేర్ పార్ట్స్ అందజేయడం లో నిర్లక్ష్యం వహించడం ఇవి అన్ని పైనుంచి కింది స్థాయి అధికారులను క్షేత్రస్థాయిలో కార్మికులు గమనిస్తూ ఉన్నారు. 8 ఇంక్లియన్ నుండి సెంటినరీ కాలనీ స్కూల్ బస్ ఈ విద్యా సంవత్సరం ప్రవేశ పెట్టకపోతే అర్జీ టు జి. ఏం ఆఫీస్ ముట్టడిస్తామని ఏఐటీయూసీ అర్జీ3 బ్రాంచ్ కార్యదర్శి ఎంఆర్సిరెడ్డి హెచ్చరించారు.

## మెడికవర్‌లో మినిమల్లి ఇన్వాసివ్ గుండె శస్త్ర చికిత్స

**కార్డియోథొరాసిక్ సర్జన్ డా.రవికుమార్**



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియోవాస్క్యులర్ సర్జరీని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా ఛాతినొప్పి, తీవ్రమైన ఆయాసం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న జగిత్యాలకు చెందిన 54 ఏళ్ల మాధవి చికిత్స కోసమ మెడికవర్ ఆసుపత్రికి రాగా వైద్య పరీక్షల్లో ఆమె గుండెలోని ప్రధాన మైట్రల్ వాల్వ్ మూసుకుపోయినట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహిస్తామని అయితే ఆ పద్ధతిలో రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకొని ఛాతి కింది భాగంలో చిన్న గాటు ద్వారా మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిలో మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు వివరించగా వారు అంగీకరించడంతో శస్త్ర చికిత్స విజవవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ వల్ల నొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గడమే కాకుండా రోగి వేగంగా కోలుకుంటుందని వివరించారు. ప్రస్తుతం మాధవి పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్య సేవలను సైతం ఆరోగ్య శ్రీ పరిధిలో అందించి కొత్త జీవితం ప్రసాదించిన మెడికవర్ వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్లు అనీష్ పబ్బ, వాసుదేవరెడ్డి, అనెస్థిషియా డా.విష్ణువర్ధన్ రెడ్డి, సూపరింటెండెంట్ డా.ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మానేరు విద్యా సంస్థల్లో న్యూ అకాడమిక్ ఇయర్ ప్రారంభం




**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థల్లో 202627 విద్యా సంవత్సరాన్ని బుధవారం ఘనంగా ప్రారంభిచారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను రంగురంగుల అలంకరణలతో పాటు విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు మానేరు విద్యా సంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ సునీత్ రెడ్డిలు పుష్ప గుచ్చాలు అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బలమైన పునాది పాఠశాల విద్యతోనే ఏర్పడుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతోపాటు క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు కూడా ఎంతో అవసరమన్నారు. కరీంనగర్‌లో మానేరు విద్యా సంస్థలు ప్రారంభించి 40 ఏళ్లు గడిచిందన్నారు. మానేరు విద్యా సంస్థలు విద్యార్థులను కేవలం పాఠ్యంశాలకే పరిమితం చేయకుండా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, ఇన్చార్జీలు, కోఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మండల ఫోటో స్టూడియోల బంద్ జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం / జమ్మికుంట :** జమ్మికుంట మండలంలోని ఫోటో స్టూడియోల యజమానులు బుధవారం చేపట్టిన బంద్ విజయవంతమైందని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని ఫోటోగ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఎం.డి.ముస్తఫా పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధమైన ఐకమత్యాన్ని సహాయ సహకారాలను కొనసాగించాలని ఆయన కోరారు. ప్రస్తుతం మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు, ప్రింటింగ్ ఖర్చులు స్టూడియో సంబంధిత వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఈ భారాన్ని దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా ఫోటోస్టూడియోల సేవల ధరలను స్వల్పంగా సవరించడం జరిగిందన్నారు. ఈ ధరలు జూన్ 18 నుంచి మండలంలోని అన్ని స్టూడియోలలో అమలులోకి వస్తాయని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేందర్, మండల ఉపాధ్యక్షులు యం.డి. అజార్, ప్రధాన కార్యదర్శి దొడ్డే ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు పొనగంటి విజ్రయాజులతోపాటు ఫోటోగ్రాఫర్లు రత్నకుమార్, రాంబాబు, రవి, సునీల్ ఉపేందర్ తోట రాజేందర్, గౌతం, నాని, శ్రీను, ప్రవీణ్, హరీశ్, శ్రీనాథ్, జానీ, ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి రూ.30 వేల ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** శ్రీ పాటి అభయాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధి పనుల కోసం ఆలయ కమిటీ అధ్యక్షులు నడిపెల్లి గోపాలరావు, జనగామ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామల,రమేష్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, బుధవారం రోజున దేవాలయ అభివృద్ధి కోసం రూ.30,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీలం సంజీవ్ పటేల్, ఆరేళ్ల రవితేజ, పోలాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు,దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** ఆధునిక కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు,లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నా రు. బ్యాంక్ వివరాలు,ఓటీపీ లు ఎవరికీ చెప్పకూడదని సూచించారు .ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలనిమెంగని సమతతిరుపతి, ము త్తారం సబ్ ఇన్స్పెక్టర్ రవి కుమార్,రామగిరి ఎస్సై శ్రీనివాస్, మంథని ఎస్సై రమేష్,ఏఎస్సై చంద్రమౌళి పోలీస్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలసదన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**సంక్షేమ అధికారి( ఇంచార్జ్) కాళిందిని**

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో శ్రీ రామ టాకీస్ సమీపంలో నిర్వహిస్తున్న బాలసదన్ (చిల్డ్రెన్ హోమ్ ఫర్ గర్ల్స్) లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు (ఇంచార్జ్) జిల్లా సంక్షేమ అధికారి కాళిందిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అనాథలు, విడిచిపెట్టబడిన వారు , క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న 6 నుండి 18 సంవత్సరాల లోపు బాలికలు ప్రవేశానికి అర్హులని ఆయన పేర్కొన్నారు .అర్హత కలిగిన బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులు, సంబంధిత అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 6300398362 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ



**ప్రజాపక్షం/ముత్తారం :** అంగన్‌వాడీ కేంద్రాలే చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాదులు అని సర్పంచ్ అత్తె చంద్రమౌళి అన్నారు .బుధవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ 2 వ కేంద్రంలోని చిన్నారులకు సర్పంచ్ అత్తె చంద్రమౌళి, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న,అంగన్వాడి టీచర్ రుక్మిణి ఆధ్వర్యంలో యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అమ్మ మాట అంగన్వాడి బాట కార్య క్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రం లోని చిన్నారులకు యూనిఫామ్ అందించడం జరిగింది అన్నారు.అంతేకాకుండా అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు.